(152–వ పేజి తరువాయి)

# ఉ యం ఉంటే ··· ···

బొడ్డుపల్లి కృష్ణావధాని

ఒక రోజున వస్తాదొకడు వచ్చి కొలువు తీరియున్న రాజుతో "రాజా! నేను ఎన్నెన్నో అద్భుత కార్యాలు చేయగలను. ఎటువంటి అసాధ్యమైన పనులనైన చేయగలను పర్వతాలను సయితము మోయగలను" అన్నాడు,

"అలాగా! అయితే సమీపముననున్న పర్వతమును మోయగలవా" అని అడిగాడు.

"అదెంతపని! కాని నేను యీ మధ్య జబ్బుపడి లేచాను. ఇంకా పుష్టి సమకూరలేదు. మీరు నెల రోజులు మంచి ఆహారసదుపాయములను సమకూర్చినచో నేనా పర్వతమును అవలీలగా మోయగలను"

రాజు మంత్రిని పిలచి "ఈ వస్తాదుకు నెల రోజులు కావలసిన ఆహారసదుపాయములను ఏర్పాటు చేయండి" అని ఉత్తరువు చేసెను.

నెల రోజులు వస్తాదుకు కోరిన ఆహారవసతులు తృప్తిగా సమకూర్చబడినవి. పీనుగ ఆకారంతో వచ్చిన వస్తాదు ఏనుగలాగ తయారయ్యాడు.

నెల రోజుల తర్వాత ఒకరోజున పర్వతము చెంత రాజు మంత్రులు, సామంతులు, ప్రజలు సమావేశమయి వస్తాదును పిలిపించి పర్వతమును మోయమన్నాడు రాజు.

అక్కడున్నవారంతా పర్వతాన్ని ఆ వస్తాదు ఎలాగ మోస్తాడో చూద్దామని ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. వస్తాదు ఒకసారి చుట్టూయున్నవారిని కలయచూచి "ప్రజలారా! మీరంతాకలసి యీ పర్వతాన్ని ఎత్తి నా తలమీద పెట్టండి! నేను మోస్తాను" అన్నాడు.

రాజు నిర్ఘాంతపోయి "వస్తాదూ! నెలరోజుల గడువుకాగానే కొండను మోస్తానంటివికదా! యిదేమిటి?" అన్నాడు.

అందుకా వస్తాదు "ఓ రాజా! కొండను మోసెదనంటినేకాని ఎత్తుదుననలేదుకదా! ఇప్పుడైనా కొండను ఎత్తి నా తలమీద పెడితే తప్పకుండా మోస్తాను" అన్నాడు.

ప్రజలు, మంత్రులు ఆ మాటలువిని కొండ నెత్తగలవారెవ్వరూ లేనప్పుడు అతనిని మోయమనడం పొరబాటని గుర్తించారు.

రాజు వస్తాదు యుక్తికి సత్కరించి పంపేశాడు.

బాలలూ! వస్తాదు యుక్తి ఎంత గొప్పదో చూచారు కదూ!

# రావుజీ — పైజమా

M. V. కేశవగోపాల్

రావుజీ తాలూకాఫీసులో ఓ గుమాస్తా. ఒకసారి వారి ఆఫీసుకు అధికారి ఒకాయన వస్తాడని తెలిసింది. అధికారి దగ్గరకు వెళ్ళాలంటే మాంచి డ్రస్సుండాలి! అందుకని రావుజీ ఓ వారం రోజులు ముందుగానే దర్జీకి ఓ పైజామాకు, షర్టుకు గుడ్డ ఇచ్చాడు. రేపు అధికారిని రావ్‌జీ చూడబోతాడనగా, ఆదినం మధ్యాహ్నం దర్జీ గుడ్డలు ఇంట్లోఇచ్చి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో రావ్‌జీ ఇంట్లోలేదు. సాయంత్రం తిరిగి వచ్చాక పైజమా ఉండవలసిన కొలతకంటె రెండు అంగుళాలు పొడవెక్కువగా ఉండటం గమనించాడు.

భార్య దగ్గరకెళ్ళి, "చూడు? దర్జీ ఈ పైజామాను రెండంగుళాలు పొడవుగా కుట్టాడు. రేపే ఆఫీసర్ని దర్శించుకోవాలి... ఇదేసుకొని ఎలా పోవ

టం? కాస్త ఆ రెండు అంగుళాలు తగ్గించేసి పెట్టేద్దూ!" అని అడిగాడు రావుజీ.

"ఇప్పుడు నాకు తొందరపని ఉంది. తర్వాత కుట్టిస్తాను." అంది భార్య... రావుజీ ఉండబట్టలేక, చెల్లెలి దగ్గరికెళ్ళి,

"చూడు చెల్లాయ్! రేపు నేను ఆఫీసరు దగ్గరికెళ్ళాలి? ఆ పెను పనుందట. ఈ పైజామాను నీవైనా రెండు అంగుళాలు తగ్గించి కుట్టివ్వమ్మా" అని అడిగాడు,

"ఇప్పుడు నేను నీళ్లు తేవాలి. తర్వాత కుట్టిస్తాలే" అన్నది చెల్లాయి బిందె చంకన పెట్టుకొంటూ.

ఆఖర్దా కొద్దీ కూతుర్ని పిలిచి, "అమ్మాయ్! మీ అమ్మకు, అత్తయ్యకీ పనుందట. ఈ పైజామా పొడవు రెండు అంగుళాలు తగ్గించి కుట్టివ్వు" అన్నాడు రావుజీ.

"నాన్నా నేనిప్పుడు చదువుకోవాలి. రేపు ప్రొద్దున్నే కుట్టిస్తా"నంది కూతురు పుస్తకం తెరుస్తూ.

రావుజీ అప్పటికేమీ అనలేక భోజనం ముగించి నిద్రపోయాడు...

పనంతా అయ్యాక రావుజీ భార్య "అయ్యో! ఆయన చెప్పారు కదూ-పైజామా సరిచేయమని" అని జ్ఞప్తికి తెచ్చుకొని, రెండించీలు చించి కుట్టిపెట్టి వెళ్ళిపోయింది.

ఆ తరువాత రావుజీ చెల్లాయివచ్చి "అన్నయ్య పైజామాను కుట్టిస్తాను అన్నాను కదా!" అని రెండించీలు తగ్గించి కుట్టిపెట్టింది. ప్రొద్దున్నే కూతురు కూడా నాన్నగారి పైజామాను కుట్టి, సరిచేసి పెట్టింది

ఇక ప్రొద్దున్నే రావుజీ కాల కృత్యాలన్నీ ముగించుకొని, 9 గంటలకల్లా భోజనం ముగించి డ్రస్సు వేసుకోబోయాడు. పైజమా వేసుకొందామని తీశాడు...తీరాచూస్తే...తాను చెప్పిన కొలతలకంటే నాలుగు ఇంచీలు పొట్టిదైవుంది. రావుజీకి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది, ఆ డ్రస్సు చూసేసరికి ... ఇప్పుడెలా కలవటం ఆఫీసర్ని ఈ పొట్టి పైజామాతో ...ఛ...ఛ ... అనుకొని కడకు వర్టువేసుకొని, పంచకట్టుకొని బయలుదేరాడు ఆఫీసుకి.

చూశారూ! ఒక్క పనిని ఒక్కరికి చెప్పడం బాగు. కానీ. పలువురకు చెప్పడంవల్ల ఎంత రాద్ధాంతమయిందో చూడండి. అలా చెప్పడంవల్ల, డాబుగా వెళదామనుకున్న రావ్‌జీ మామూలు దుస్తుల్లో వెళ్ళవలసి వచ్చింది.

కటకరసాయనం
బాహ్య, అంతర్గత మూలవ్యాధి చికిత్సకు దివ్యౌషధము. ఇందులో ప్రమాదకరమైనట్టియు, అలవాటుకలుగజేయు ఓషధులేవియు చేరియుండలేదు. రుచికరంగాను, సులభముగా సేవించుట కనువుగానున్నది. వివరములకు:
కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్
మద్రాసు - 14.

